దిన పత్రిక
తొలి సమయం
వాస్తవమే గమ్యం! గమనం!!
గురువారం । 17 । జూన్ । 2026

# ఆదివాసి సమాజమా!

# అందుకోండి మేలు కొలుపు లేఖ...

## ఆదివాసీ 9 తెగల జాక్ చైర్మన్ చుంచు రామకృష్ణ ( డిఖ)

## తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మైపతి అరుణ్ కుమార్..

యావత్ ఆదివాసీ సమాజంలోని అన్ని తెగల ప్రజలందరికీ శిరస్సు వంచి నమస్కరిస్తూ,గత 50 ఏళ్లుగా 1976 ఎమర్జెన్సీ కాలంలో శ్రీమతి ఇందిరాగాంధీ గారు ఇచ్చిన ఒక జీవో ఆధారంగా, భారత రాజ్యాంగం లోని ఆర్టికల్ 342 ప్రకారం గుర్తించని, సంచార జాతులకు చెందిన గోర్ బంజారాలు, చట్ట బద్ధత లేకుండా రిజర్వేషన్ ప్రయోజనాలు విద్యా, ఉద్యోగాలు, రాజకీయ పదవులు, ఏజెన్సీ భూములు కొల్లగొడుతూ, చివరికి సాంస్కృతిక పరమైన దోపిడీకి కూడా భరి తెగించడంతో, జాతి హక్కుల పరిరక్షణ కోసం 1996 లో ఏర్పడిన ఆదివాసీ తెగల గుండె చప్పుడు తుడుందెబ్బ 1997 నిజాం కాలేజీ గ్రౌండ్ లో మొదలు పెట్టిన ఉద్యమం అనేక ఒడుదుడుకులు, నిర్బంధాలు ఎదుర్కుంటూ, జాతి గుండె చప్పుడు ఆగిపోకుండా కుట్రలు, కుతంత్రాలు తట్టుకుంటూ తుడుందెబ్బ ఆకుపచ్చ జెండాను కాపాడుకుంటూ , ఆదివాసీ పోరాట వీరుడు కుమ్రం భీమ్ పోరాట గడ్డ జోడే న్ ఘాట్ నుండి 2017 సం లో మ్యూజియం నుండి శంకీ బొమ్మను తొలగించడంతో మొదలైన చట్టబద్ధత లేని లంబాడీలను జాబితా నుండి తొలగించాలి అనే నినాదం, నిప్పురవ్వ లా వెలిగి, కార్చిచ్చులా ఆదిలాబాద్ అడవులు, వరంగల్ అభయారణ్యం, ఖమ్మం ఏజెన్సీ దాటి ఆంధ్రా ప్రాంతంలోని అన్ని ఆదివాసీ గుడేల్లో ఉద్యమాన్ని రగిలించి 9 డిసెంబర్ 2017 నాడు లక్షలాది ఆదివాసీలతో తుడుందెబ్బ ఆధ్వర్యంలో, ఆనాటి ఉద్యమ నేత సోయం బాపూరావు దాదా నాయకత్వంలో ఆదివాసీ ఆత్మగౌరవ సభ ఎంతటి విజయం సాధించిందో, అంతే తొందరగా జాతి కుద్దు పటేళ్ల కుట్రలతో యావత్ ఆదివాసీ సమాజం పోరాటం ఆవిరైపోయింది. మళ్ళీ దాన్ని 31 డిసెంబర్ 2017 నాడు హన్మకొండ లోని హోటల్ శ్రేయలో ఉన్నత, రిటైర్డ్ ఉద్యోగుల సమావేశం ద్వారా సుప్రీం కోర్టులో న్యాయపోరాటం చేయాలని దాదాపు 65 మంది ఉద్యోగులు ఏక గ్రీవ తీర్మానం చేసేలా, దానికి కావలసిన ఆర్థిక నిధుల కోసం 2018 జనవరి లో హన్మకొండ లోని అంబేద్కర్ భవన్లో ఆధార్ సొసైటీ అకౌంట్ ద్వారా సేకరించాలని కృషి చేసిన నాయకులు ఎవరో యావత్ సమాజానికి తెలుసు. 2018 మే నెలలో సుప్రీం కోర్టులో కేసు ఫైల్ చేసిన తర్వాత, దాన్ని పరిగణనలోకి తీసుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు ఇచ్చి, విచారణ దశకు తీసుకు రావడంలో డిల్లీ సుప్రీం కోర్టుకు స్వంత ఖర్చులతో అనేక సార్లు తిరిగిన ఉద్యోగులు ఎవరో కూడా యావత్ సమాజానికి తెలుసు. ఒక పక్క న్యాయ పోరాటంతో పాటు, పట్టాలు తప్పిన ప్రజా పోరాటాన్ని , ఆనాటి ఉద్యమ నేత సోయం దాదా ఎంపీ గా ఎన్నికైనా తరువాత ఢిల్లీలో ఆదివాసీల అరణ్య ఘోషను వినిపించడానికి 9 డిసెంబర్ 2019 న ఛలో ఢిల్లీ రాంలీలా సభను విజయవంతం చేయడం కోసం మొదటి సారిగా జోడయాత్రను ఉమ్మడి ఖమ్మం వరంగల్ జిల్లాలోని ఆదివాసీ గూడెల్లో చేయడం ద్వారా ఆనాటి డిల్లీ రాంలీలా మైదానంలో దాదాపు లక్ష మంది ఆదివాసీలతో నిర్వహించిన ఆదివాసీ అస్తిత్వ గర్జన చరిత్రాత్మక రీతిలో విజయవంతం అయిన విషయం యావత్ ఆదివాసీ సమాజానికి తెలిసిందే. ఆ సభ సక్సెస్ తో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారి దృష్టికి సమస్యను తీసుకువెళ్ళడంతో పాటు, సోయం దాదా నేతృత్వంలో రాజకీయ పోరాటం చేస్తూ అనేక సార్లు కేంద్రమంత్రులను, గౌరవ రాష్ట్రపతి , ఉప రాష్ట్రపతి గార్లకు కూడా నివేదికలు అందించడంలో కృషి చేసిన నాయకులు కూడా ఎవరో యావత్ ఆదివాసీ సమాజానికి తెలిసిందే. దాని తరువాత ప్రపంచాన్ని వణికించిన కరోనా మహమ్మారి కారణంగా ఆగిపోయిన ప్రజా పోరాటం, జాతి కుద్దు పటేళ్ల కుట్రలతో ఉద్యమ నేత తుడుందెబ్బ నాయకత్వాన్ని వదులుకోవడమే కాకుండా, రాజకీయంగా పదవిని కోల్పోయి చివరికి ఢిల్లీ చేర్చిన పార్టీ నుండి సైతం తప్పుకోవడం తెలిసిందే. అయినా సరే చట్ట బద్ధత లేని లంబాడీలను జాబితా నుండి తొలగించాల్సిందే అనే సోయం బాపూరావు దాదా, భద్రాచలం గా చట్ట సభలో అడుగుపెట్టిన తెల్లం వెంకట్రావు గారి ద్వారా సుప్రీం కోర్టులో కొనసాగుతున్న కేసుల్లో ఇంప్లీడ్ చేయడం ద్వారా , ఒక్క సారిగా ఉలిక్కిపడ్డ గోర్ బంజారాలు వ్యక్తిగత దూషణలకు దిగి బెదిరించడంతో, మళ్ళీ జాతిని ఏకం చేయడానికి కావల్సిన ఆదివాసి 9 తెగల ఐక్య కార్యాచరణ కమిటీ ఏర్పాటు కావడానికి కృషి చేసిన, 2017 డిసెంబర్ 31 మొదలు 2025 సెప్టెంబర్ వరకు అవిశ్రాంతంగా ప్రజా పోరాటం, న్యాయ పోరాటం, రాజకీయ పోరాటం సమన్వయం చేస్తూ , సమ్మక్క తల్లి ఆశీస్సులతో చిరుమల్ల కేంద్రంగా సాంస్కృతిక పోరాటాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్న నిస్వార్థ నాయకున్నే చైర్మన్ గా ఉస్మానియా యూనివర్సిటీలో దాదాపు 250 మంది ప్రతినిధుల సమక్షంలో ఎన్నుకోవడం కూడా యావత్ ఆదివాసీ సమాజానికి తెలిసిందే. 14 సెప్టెంబర్ 2025 నాడు చైర్మన్ గా బాధ్యతలు తీసుకుని, ఒక్క రూపాయి నిధులు లేని ఆదివాసీ 9 తెగల ఐక్య కార్యాచరణ కమిటీ ద్వారా కేవలం 2 వారాల వ్యవధిలో చట్టబద్ధత లేని లంబాడీలను జాబితా నుండి తొలగించడానికి ఆదివాసీ 9 తెగల ధర్మ యుద్ధం ప్రకటించి లొట్ట పిట్ట గండి బీరమయ్య ఆశీస్సులతో గోదావరి నది కి ఇరుపక్కలా జోడయాత్ర నిర్వహించడం ద్వారా 28 సెప్టెంబర్ 2025 ధర్మయుద్ధం సభ అంచనాలకు అందని రీతిలో విజయవంతం అయిన విషయం యావత్ ఆదివాసీ సమాజానికి తెలిసిందే. ఈ సభ సక్సెస్ లో ప్రచార కమిటీ చైర్మన్ , తుడుం దెబ్బ నాయకత్వాన్ని యువకులకు కేటాయించాలని డిమాండ్ చేసి రాష్ట్ర అధ్యక్షునిగా ఉన్న డా మైపతి అరుణ్ కుమార్ గారి కృషి అందరికీ తెలిసిందే. దీనితో మళ్లీ కుట్రలు, కుతంత్రాలు మొదలు పెట్టిన జాతి కుద్దు పటేళ్లు వారం వ్యవధిలోనే వసూలు చేసుకున్న డబ్బులకు లెక్కలు చెప్పకుండా , అనేక సార్లు పడిపోతున్న ఉద్యమాన్ని నిలబెట్టుకుంటూ , ఉద్యోగాన్ని, కుటుంబాన్ని సైతం పక్కన పెట్టి కాళ్ళకు చెప్పులు లేకుండా సమ్మక్క తల్లి బాణంతో జాతి ఉద్యమాన్ని ఒక పవిత్ర యజ్ఞంలా చేస్తున్న ఆదివాసీ 9 తెగల జేఏసీ చైర్మన్ పైనే నిందలు వేసి, లంబాడీలను తొలగించే డిమాండ్ ను వదలి చైర్మన్ ను తొలగించాల్సిందే అంటూ, గోర్ బంజారాలతో తెర వెనుక చేతులు కలిపి, రెండో జాక్ ఏర్పాటుతో ఉద్యమాన్ని ఆపివేయగలిగాము అని విశ్రాంతి తీసుకుంటున్న కుద్దు పటేల్ల నిజ స్వరూపంపై కూడా యావత్ ఆదివాసీ సమాజం ఒక సారి ఆలోచన చేయండి. జాతి కుద్దు పటేళ్లు విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో జాతి అస్థిత్వం కోసం అహర్నిశలు పని చేస్తున్న ఉద్యోగ , విద్యార్థి నాయకత్వం సమ్మక్క తల్లి వదలిన బాణంతో, కుమ్రం భీమ్ వదలిన మిస్సైల్ తో వ్యూహాత్మకంగా తుడుందెబ్బ సైన్యాన్ని ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో నిర్మాణం చేసుకుని, ఆదివాసీ 9 తెగల జేఏసీ మద్దతు ద్వారా మండుతున్న రికార్డు స్థాయి ఎండల్లో జోడెద్దుల్లా జోడయాత్ర ద్వారా ప్రచారం చేసి, ఆదివాసీ రాజకీయ నాయకుల కుట్రలను సైతం ఛేదించి జూన్ 3 న పాఖాల కొత్తగూడలో తుడుందెబ్బ ఆధ్వర్యంలో నిర్వహించిన పోరుకేకవిజయవంతం కావడంతో మళ్లీ నిద్ర లేచిన కుద్దు పటేళ్లు సంఘాల పేరుతో జాతిని మోసం చేస్తున్న కుట్రలను ఇప్పటికైనా తిప్పి కొట్టాల్సిన బాధ్యత యావత్ ఆదివాసీ సమాజం లోని మేధావులది, ఉద్యోగులది, నిరుద్యోగులది, విద్యా ర్థులది, మహిళలది, గుడేల పెద్దలది, ప్రజలది. అంతి మంగా యావత్ ఆదివాసీ సమాజానికి శిరస్సు వంచి మనవి చేస్తున్నది మన జాతి అస్తిత్వాన్ని ఉత్తరాది నుం డి వలస వచ్చిన గోర్ బంజారాల నుండి, ప్రజా పోరా టాన్ని ప్రతి సారి కూలుస్తున్న జాతి కుద్దు పటేళ్ల నుండి కాపాడుకోవాల్సిన బాధ్యత మీరు తీసుకుంటే, ఆదివాసీ తెగల దేవతల ఆశీస్సులు , పోరాట వీరుల స్ఫూర్తితో గత 10 ఏళ్లుగా పడుతూ లేస్తూ వస్తున్న ప్రజా ఉద్యమ కెరటాల శక్తిని కూడగట్టుకుని 9 డిసెంబర్ 2026 నాటికి మానుకోట గడ్డ మీద ఆదివాసీ సునామీలా లక్షలాది ఆదివాసీలతో 9 తెగల సాంస్కృతిక ర్యాలీ మరియు భారీ బహిరంగ సభ నిర్వహించడానికి మా శాయశక్తులా జోడెద్దుల్లా నిస్వార్థంగా పోరాడుతామని యావత్ ఆదివాసీ సమాజానికి తెలియచేస్తూ ...



# జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమం ఏర్పాట్లపై సమీక్ష సమావేశం



**తొలి సమయం మహబూబాబాద్, జూన్.17**
జూన్ 28 నుండి 30 వరకు నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు బుధవారం ఐ.డి.ఓ.సి లోని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. బి. రవి రాథోడ్ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి (డీఎంహెచ్ఓ) డా. రవి రాథోడ్ మాట్లాడుతూ జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమానికి అవసరమైన వ్యాక్సిన్ పంపిణీ, కోల్డ్ చైన్ నిర్వహణ, బూత్‌ల ఏర్పాటు, సిబ్బంది శిక్షణ, పర్యవేక్షణ తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉపకేంద్రాలు మరియు పోలియో బూత్‌లకు వ్యాక్సిన్‌ను సకాలంలో పంపిణీ చేసి కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని నిర్ణయించారు.జూన్ 28న పోలియో బూత్‌ల ద్వారా 05 సంవత్సరాల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయనుండగా, జూన్ 29 మరియు 30 తేదీలలో ఇంటింటి సందర్శన ద్వారా మిగిలిన పిల్లలకు పోలియో చుక్కలు వేయనున్నారు. జిల్లాలో సుమారు 55 వేల మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడం లక్ష్యంగా నిర్ణయించినట్లు డీఎంహెచ్ఓ తెలిపారు.పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి తల్లిదండ్రి తమ పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.జిల్లా విస్తరణ మరియు మీడియా అధికారి రాజ్‌కుమార్, ఆరోగ్య విద్యాధికారి పురుషోత్తం, సబ్ యూనిట్ అధికారి వి. శ్రీనివాస్, ఆరోగ్య సహాయకులు కె.ఎల్.ఎన్. స్వామి, ఎస్. శ్రీనివాస్, పి. లింగారెడ్డి, అనిల్, సత్యనారాయణ, ఫార్మసిస్ట్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

# పాత లింగాల చెరువు కట్టను పరిశీలించిన ఎమ్మెల్యే కోరం కనకయ్య



**తొలి సమయం, కామేపల్లి: జూన్, 17:**
గత ఏడాది తుఫాన్ కారణంగా దెబ్బతిన్న పాత లింగాల చెరువు కట్టను ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాసరెడ్డి, ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. చెరువు కట్టకు రూ.2.16 కోట్లతో శాశ్వత మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు సహ కారంతో కాంక్రీట్ నిర్మాణం ద్వారా శాశ్వతంగా మరమ్మతులు చేపడతామని ఎమ్మెల్యే తెలిపారు. నాలుగు నుంచి ఐదు రోజుల్లో ఫైళ్లకు ఆమోదం లభించి పనులు ప్రారంభమవుతాయని చెప్పారు.ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు. చెరువు కట్టకు శాశ్వత మరమ్మతులు చేపట్టనున్నందుకు రైతులు ఎమ్మెల్యే కోరం కనకయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

# మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన దుర్మార్గుడికి ఉరిశిక్ష వేయాలి




**బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి..**

**విశ్వహిందూ పరిషత్, దుర్గా వాహిని, మాతృశక్తి**

**మహబూబాబాద్ జిల్లా కమిటీ నాయకులు..**

**తొలి సమయం మహబూబాబాద్ జూలై 17**
ఖమ్మం జిల్లా కేంద్రంలో మైనర్ బాలికపై అత్యాచారం చేసిన కామాంధుడు గౌస్ పాషా పై వెంటనే ప్రభుత్వం ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేసి ఇలాంటి అమానవీయ దారుణాలు పునరావృత్తం కాకుండా ఉరిశిక్ష వేయాలని, బాధిత మైనర్ బాలిక కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, మహబూబాబాద్ విశ్వహిందూ పరిషత్, దుర్గా వాహిని, మాతృశక్తి మానుకోట జిల్లా కమిటీ బాధ్యులు, జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు కార్యాలయం ప్రజావాణి కార్యక్రమం లో కలెక్టర్ కు వినతి పత్రం ఇచ్చారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మైనర్ బాలిక అనే కనీస విచక్షణ లేని మానవ మృగం గౌస్ పాషా చేసిన అమానవీ దారుణాన్ని ఖండిస్తున్నామని అన్నారు, సమాజంలో ఇలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని, చివరిప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న మైనర్ బాలికలు కాపాడాలని అన్నారు తక్షణ సహాయము క్రింద 10 లక్షలు అందజేయాలని బాధిత బాలిక పేరున కోటి రూపాయలు డిపాజిట్ చేయాలని, బాలిక తల్లి లేదా తండ్రికి విద్యార్హత మేరకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని , భవిష్యత్తులో ఇలాంటి అమానవీయ సంఘటనలు జరగకుండా ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేసి న్యాయ విచారణ జరిపి,ఉరిశిక్ష వేయాలని డిమాండ్ చేశారు,

# ప్రైవేటు పాఠశాలల దోపిడీపై చర్యలు తీసుకోవాలి: ఏఐఎస్ఎఫ్



**తొలి సమయం, వనపర్తి; జూన్, 17:**
జిల్లాలో ప్రైవేటు పాఠశాలలు ఫీజులు, పాఠ్యపుస్తకాలు, యూనిఫారాల పేరుతో విద్యార్థులను దోచుకుంటున్నాయని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఇన్‌చార్జ్ రమేష్ ఆరోపించారు. ఈ మేరకు డీఈఓ కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. అనుమతులు, కనీస సౌకర్యాలు లేని పాఠశాలలపైనా తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘిస్తున్న యాజమాన్యాలపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఫీజుల నియంత్రణకు చర్యలు తీసుకుని, ప్రతి పాఠశాలలో ఫీజుల పట్టికను ప్రదర్శించేలా ఆదేశించాలని కోరారు. లేనిపక్షంలో విద్యార్థులతో కలిసి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు వంశీ, ఉదయ్, అరవింద్ పాల్గొన్నారు.

# క్షేత్ర స్థాయిలో పక్కా సర్వేలు నిర్వహించాలి

## జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్



**తొలి సమయం మహబూబాబాద్ జూన్ 17**
బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, నక్ష సర్వే పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైౖ సర్వే కొనసాగుతున్న మహబూబాబాద్ పట్టణంలోని గుమ్మడూరు, జామండ్లపల్లి, తదితర ప్రదేశాలలో కొనసాగుతున్న ఇండ్ల సర్వే ను స్వయంగా పరిశీలించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం తీసుకోవాల్సిన చర్యల గురించి కలెక్టర్ స్నేహ శబరీష్ , ల్యాండ్ సర్వే అసిస్టెంట్ డైరెక్టర్, మున్సిపల్ కమిషనర్, తహసిల్దార్, లకు తగు సూచనలు జారీ చేశారు. క్షేత్రస్థాయిలో పక్కా సర్వేలు నిర్వహించాలని సూచించారు. ఇప్పటికే సూచించిన ప్రకారం నక్ష సర్వే కొనసాగుతుందని, ల్యాండ్ సర్వే ఏడి శ్రీనివాస్, తహసిల్దార్ రాజేశ్వర్, మున్సిపల్ కమిషనర్ వినోద్ కుమార్, తదితరులు కలెక్టర్కు తెలిపారు.

# పేదలకు వరం సీఎం సహాయనిధి: ఎమ్మెల్యే కోరం కనకయ్య




**తొలి సమయం,ఇల్లందు;జూన్, 17:**
పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సి ఎం ఆర్ ఎఫ్) ఒక వరమని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం సహాయనిధి, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, వైద్యం కోసం దరఖాస్తు చేసుకున్న వారికి సీఎం సహాయనిధి ద్వారా త్వరితగతిన ఆర్థిక సాయం అందుతోందని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు.ఇల్లందు మండలం, పట్టణానికి చెందిన 55 మంది బాధితులకు సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. అలాగే కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద 56 మంది లబ్ధిదారులకు రూ.56,06,496 విలువైన చెక్కులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కిరణ్ మిత్ర, ఏఎంసీ చైర్మన్ భానోత్ రాంబాబు, 22వ వార్డు కౌన్సిలర్ కొర్లపాటి శివకిరణ్, తహసీల్దార్ ఖాసీం, కౌన్సిలర్లు, సర్పంచులు, ఉపసర్పంచులు తదితరులు పాల్గొన్నారు.